క్లుప్తంగా

ఉపాధి కూలీలకు పని దినాలను పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో జీఆర్ మనోజ్

ఉంగుటూరు: ఉపాధి హామీ కూలీలకు రోజు వారి వేతనం పెరిగేలా ఫీల్డ్ అసిస్టెంట్‌లు కృషి చేయాలని ఎంపీడీఓ జీఆర్ మనోజ్ కోరారు. బుధవారం సాయంత్రం జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరి కోతల పనులు ముగుస్తున్నందున ఉపాధి హామీ పథకం కూలీలకు అన్ని గ్రామాల్లో పనులు కల్పించాలని ఆయన ఆదేశించారు. అదే విధంగా పని చేస్తున్న ప్రదేశంలో వసతులు కూడా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ ఖాజావలి, ఈసీ, టీఏలు పాల్గొన్నారు.

దేవునిపై ప్రతి ఒక్కరూ విశ్వాసంతో ఉండాలి



వాక్యోపదేశాన్ని అందిస్తున్న బెంగళూరుకు చెందిన బ్రదర్ స్టీఫెన్ బాబు

భీమడోలు: దేవునిపై ప్రతి ఒక్కరూ విశ్వాసంతో ఉండాలని బెంగళూర్‌కు చెందిన బ్రదర్ స్టీఫెన్ బాబులు అన్నారు. భీమడోలు పంచాయతీ శివారు ఆర్జావారిగూడెంలోని సీఎస్ఐ సెంటినరీ క్రైస్ట్ చర్చిలో 13వ ప్రతిష్ఠ వార్షికోత్సవ ఉజ్జీవ ఆశీర్వాద కూడికలు మంగళవారం రాత్రితో ఘనంగా ముగిశాయి. రెవరెండ్ జాన్ డేవిడ్ అధ్యక్షతన మూడు రోజుల పాటు నిర్వహించిన సువార్త కూడికలకు క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రెవరెండ్ తాళ్లూరి డేవిడ్‌రాజు, సీహెచ్ సంతోష్‌రెడ్డి, బ్రదర్ స్టీఫెన్ బాబు దైవ సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో డీనరీ చైర్మన్ గురువులు రెవరెండ్ కె.జాన్ డేవిడ్, అసిస్టెంట్ పాస్టర్ అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు డీవైఈఓ రవీంద్ర భారతికి సత్కారం



నిమ్మగడ్డ రవీంద్ర భారతిని శాలువాతో సత్కరిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: ఏలూరు డివైఈఓ గా బాధ్యతలు స్వీకరించిన మండల విద్యాశాఖాధికారిణి నిమ్మగడ్డ రవీంద్ర భారతిని యూటీఎఫ్ నాయకులు ఘనంగా సత్కరించారు. బుధవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఉంగుటూరు మండల విద్యాశాఖాధికారి పరసా వెంకట్రావు, ఉంగుటూరు యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సీహెచ్ శ్రీధర్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వునుముల రాంబాబు, డాకి జోగినాయుడు ఆధ్వర్యంలో ఆమెను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు తూతిక శివయ్య, కోశాధికారి ఓ.ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం నిరసన



కట్టా ఏసుబాబు

దెందులూరు: విద్యార్థుల భవిష్యత్తు భద్రత కోసం వెంటనే కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా కార్యదర్శి కట్టా ఏసుబాబు డిమాండ్ చేశారు. బుధవారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆయన నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు అన్ని ప్రచార సభలో కూటమి నాయకులు వస్తే అన్ని హామీలు అమలు చేస్తామన్నారు. ప్రభుత్వం ఏర్పడి పది నెలలు కావస్తున్న మిగతావి ఎలా ఉన్నా జీవితంపై ఆశలు పెట్టుకుని తల్లిదండ్రులు కష్టపడి చదివిస్తున్న విద్యార్థుల భవిష్యత్తును ఎగతాళి చేసే విధంగా నాయకులు ప్రజా ప్రతినిధులు ఫీజు రియంబర్స్‌మెంట్ పథకాన్ని నిర్వీర్యం నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. కళాశాల యాజమాన్యాలు విద్యార్థుల పట్ల కఠిన వైఖరి అవలంబిస్తున్నారన్నారు. విద్యార్థుల్లో తీవ్ర ఆగ్రహం నిరసన వ్యక్తం కాకముందు కూటమి ప్రభుత్వం వెంటనే ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదవేగి : మండలంలోని పెదవేగి సెక్షన్ పరిధిలో ఉన్న 33/11 వేవీ వేగివాడ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల పని నిమిత్తం శుక్రవారం ఉదయం 09:30 గంటల నుంచి మధ్యాహ్నం 2 :30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయబడుతుందని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆపరేషన్స్ కేఎం అంబేడ్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సన్నద్ధం

పాఠశాలల్లో ప్రత్యేక శిక్షణలు మరూ

గణపవరం: పదో తరగతి పబ్లిక్ పరీక్షలలో తప్పిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. నియోజకవర్గంలోని నాలుగు మండలాలలో గత నెల 24 నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పదో తరగతిలో వివిధ సబ్జెక్టులలో ఫెయిల్ అయిన విద్యార్థులందరూ ప్రత్యేక తరగతులకు హాజరయ్యేలా ఇప్పటికే ఉపాధ్యాయులు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఫెయిల్ అయిన విద్యార్థులకు ఉపాధ్యాయులు ధైర్యం చెప్పి నెలలోగా మీ పిల్లలు పదోతరగతి పాస్ అయ్యేలా తాము బాధ్యత తీసుకుంటామని వారిలో మానసిక స్థైర్యం నింపారు. తల్లిదండ్రులకు తమ పిల్లలను తప్పనిసరిగా ప్రత్యేక తరగతులకు పంపేలా ఒప్పించడంతో దాదాపుగా పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులంతా ఆయా పాఠశాలల్లో ఉదయం పూట నిర్వహించే ప్రత్యేక తరగతులకు హాజరవుతున్నారు.

19 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

ఫెయిల్ అయిన విద్యార్థులకు ఈ నెల 19 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహిస్తామని విద్యాశాఖ ఇప్పటికే ప్రకటించింది. అప్పటి వరకూ ఆయా సబ్జెక్టుల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి పాస్ అయ్యేలా సబ్జెక్టు ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి సూచనల మేరకు ప్రధానోపాధ్యాయులు కార్యాచరణ ప్రణాళిక మలుకు చర్యలు తీసుకున్నారు. తరగతులు ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకూ రోజుకు మూడు సబ్జెక్టులు, ప్రతి సబ్జెక్టుకు గంటన్నర సమయం కేటాయించేలా టైమ్ టేబుల్‌ను కూడా విడుదల చేసింది. తెలుగు, హిందీ, ఇంగ్లీషు సబ్జెక్టులు ఒకరోజు, గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టులు ఒకరోజు వరుస క్రమంలో నిర్వహిస్తున్నారు. అయితే వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా రెమిడియల్ తరగతులు ఉదయం 7.30 గంటల నుంచి 10.30 గంటల వరకూ మాత్రమే నిర్వహించాలంటూ ఆదేశాలు రావడంతో రోజుకు మూడు సబ్జెక్టులు, ఒక్కో సబ్జెక్టుకు గంట సమయం కేటాయించి ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు.



భౌతికశాస్త్రంలో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

670 మందికి శిక్షణ

నియోజకవర్గంలో ఈఏడాది పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు 1979 మంది విద్యార్థులు హాజరుకాగా, 1309 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వివిధ సబ్జెక్టులలో మొత్తం 670 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. ఉత్తీర్ణులు కాని విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు పూర్తయ్యే వరకూ ప్రత్యేక రెమిడియల్ తరగతుల నిర్వహణ ప్రారంభమైంది. ఉంగుటూరునియోజక వర్గంలోని నాలుగు మండలాలలో అత్యధికంగా గణపవరం మండలంలో 85 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కాగా, అత్యల్పంగా నిడమర్రు మండలం 57 శాతం ఉత్తీర్ణత సాధించింది. ఉంగుటూరు మండలంలో 60 శాతం, భీమడోలు మండలంలో 70 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఈ నెల 19 నుంచి నిర్వహించే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలలో నూరుశాతం ఉత్తీర్ణులయ్యేలా విద్యాశాఖ పకడ్బందీగా కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తుంది.

నియోజకవర్గంలో పదోతరగతి ఫలితాల వివరాలు

మండలం	హైస్కూల్స్	మొత్తం విద్యార్థులు	పాసైనవారు	ఫెయిలైనవారు
గణపవరం	7	484	404	80
నిడమర్రు	7	311	176	135
ఉంగుటూరు	10	600	361	239
భీమడోలు	7	584	368	216
మొత్తం:	31	1979	1309	670

నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



జిల్లా కలెక్టరు ఆదేశాలమేరకు మండలంలో ప్రత్యేక రెమిడియల్ తరగతులు ప్రారంభించాం. ఈ నెల 19 నుంచి జరిగే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలలో నూరుశాతం ఉత్తీర్ణత సాధనకు కార్యాచరణ రూపొందించాం. మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలలో 85 శాతం ఉత్తీర్ణత వచ్చింది. మండలంలో 7 జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి 484 మంది విద్యార్థులు హాజరు కాగా 404 మంది ఉత్తీర్ణులు కాగా, 80 మంది విద్యార్థులు మాత్రమే వివిధ సబ్జెక్టులలో ఫెయిల్ అయ్యారు. మండలంలో రికార్డు స్థాయిలో 56 మంది విద్యార్థులు 500పైబడి మార్కులు సాధించారు.

– గొర్రెల బాలయ్య, ఎంఈవో గణపవరం

ఫెయిల్ అయిన విద్యార్థులంతా హాజరు



గత వారం విడుదలైన పదోతరగతి పబ్లిక్ పరీక్షలలో మా పాఠశాల మండలంలోనే అత్యధికంగా 8 1 శాతం ఉత్తీర్ణత వచ్చింది. మొత్తం 26 మంది విద్యార్థులకు గాను 21 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కాగా, ఐదుగురు విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. ఫెయిల్ అయిన ఐదుగురు విద్యార్థులు ప్రతి రోజూ రెమిడియల్‌తరగతులకు హాజరవుతున్నారు.

– యర్రంశెట్టి శేషగిరిరావు, హెచ్‌ఎం జెడ్పీ హైస్కూలు, చానమిల్లి

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం



కోడే కాశి

నిడమర్రు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉంగుటూరు నియోజకవర్గ 25 అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి బుధవారం రాత్రి ప్రకటన వెలువడింది. యూత్ వింగ్ అధ్యక్షుడిగా నిడమర్రు జెడ్పీటీసీ సభ్యుడు కోడే కాశీ విశ్వనాథం, మహిళా విభాగం అధ్యక్షురాలిగా గంటా శ్రీలక్ష్మి, రైతు విభాగం అధ్యక్షుడిగా తమ్మిన శ్రీనివాసరావును, బీసీ సెల్ అధ్యక్షుడిగా తుమ్మగుంట రంగారావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా తలమటి వెంకటేశ్వర్లు, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా వదిత రాజు, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా డాక్టర్ కామిల్ జామా, క్రిస్టయన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా చిన్నం అనిల్‌కుమార్‌ను, ఆర్టీఐ విభాగ అధ్యక్షుడిగా అంబటి నాగేంద్ర ప్రసాద్, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడిగా మాన్‌సింగ్, వాణిజ్య విభాగ అధ్యక్షుడిగా పసుపులేటి సత్యనారాయణ, వీవర్స్‌య వింగ్‌కు బండారు నాగరాజు, వైఎస్సార్ టీయూసీ అధ్యక్షుడిగా పానుకుమాటి బాబ్జి, లీగల్ సెల్ అధ్యక్షుడిగా నిమ్మల రాము, కల్చరల్ వింగ్ అధ్యక్షుడిగా చోడవరపు నారాయణ, సోషల్‌మీడియా విభాగా అధ్యక్షుడిగా బుద్దిన నాగబాబు, ఐటీ వింగ్‌కు చిట్టూరి సాయి కృష్ణ, దివ్యాంగుల వింగ్‌కు కెవీవీ సత్యనారాయణ, డాక్టర్స్ వింగ్‌కు పత్సమట్ల సతీష్ రాజును, ఇంటలెక్చువల్స్ ఫోరానికి నౌడు వెంకట అచ్యుతరామారవును, ఉద్యోగులు, పెన్షనర్స్ వింగ్‌కు బీవీ సుబ్బారావును, బూత్ కమిటీకి దండు రాజ్‌కుమార్‌రాజును, పబ్లిసిటీ వింగ్‌కు ఎస్కే అజామ్‌లను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.

బాల్య వివాహాల నిరోధంపై అవగాహన

భీమడోలు: బాల్య వివాహాల రహిత జిల్లాగా సర్వమత పెద్దలు, బాల్య వివాహాల నిరోధక కమిటీలు తమ వంతు కృషి చేయాలని క్రాఫ్ జిల్లా కో–ఆర్డినేటర్ ఆర్.వినోద్‌కుమార్ అన్నారు. గుండుగొలను, పూళ్ల గ్రామాల్లో చైల్డ్ రైట్స్‌అడ్వకేసి ఫౌండేషన్, క్రాఫ్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం అక్షయ తృతీయ నాడు బాల్య వివాహాలు జరగకుండా చూసుకోవడానికి సామూహిక అవగాహన ప్రచారాన్ని నిర్వహించారు. క్రైస్తవ, హిందు దేవాలయాల వద్ద సర్వమత పెద్దలతో కలిసి బాల్య వివాహాల నిరోధంపై ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా గుండుగొలను గ్రామంలో ఫాదర్ కాకి చార్లెస్ మాట్లాడుతూ మా దేవాలయంలో బాల్య వివాహాలు చేయబోమని, ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే తానే 1098 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేస్తానన్నారు. జిల్లా కో–ఆర్డినేటర్ ఆర్.వినోద్‌కుమార్ మాట్లాడుతూ బాల్య వివాహం చేసినా, సహకరించినా జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో క్రాఫ్ సీఎస్‌డబ్ల్యూ చంద్రకళ, అంగన్వాడీ కార్యకర్తలు, సర్వమత పెద్దలు, బాల్య వివాహాల నిరోధక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పూళ్లలో దేవాలయం వద్ద బాల్య వివాహాల నిరోధంపై ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

సమస్యల పరిష్కారంలో అండగా నిలవాలి

గణపవరం: కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో అన్ని వర్గాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, సంక్షేమ పథకాలన్నీ నిలిచిపోయాయని ఈ సమయంలో వైఎస్సార్ సీపీ నాయకులు ప్రజల్లోనే ఉంటూ వారికి అన్ని విధాలా అండగా నిలవాలని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు పుప్పాల వాసుబాబు అన్నారు. బుధవారం ఆయన క్యాంపు కార్యాలయంలో ఇటీవల జిల్లా, రాష్ట్ర స్థాయి పార్టీ పదవులలో నియామకం పొందిన నాయకులతో వాసుబాబు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక అన్నిరకాల నిత్యావసరాల పెరుగుదల, విద్యుత్ చార్జీల బాదుడు, విద్యుత్ కోతలు, మహిళలపై అత్యాచారాలు, ఫ్యాక్షన్ హత్యలు పెరిగిపోయాయని, వైఎస్సార్ సీపీ నాయకులపై అక్రమ కేసులు పెడుతున్నారని విమర్శించారు. అవినీతి చట్టబద్ధం అయిపోయిందని, ఇసుక, మట్టి, గ్రావెల్ అక్రమ తవ్వకాలతో కోట్లు కొల్లగొడుతున్నారని చెప్పారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ అంటూ పలు పథకాలు ఇస్తామని నమ్మించి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చాక ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేసే పరిస్థితి లేదని చెబుతున్న కూటమి నాయకుల బండారాన్ని ఇంటింటికీ వెళ్లి ప్రజలకు తెలియజేయాలని సూచించారు.



వైఎస్సార్ సీపీ నేతలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వాసుబాబు

వైఎస్ జగన్ ఇచ్చిన పథకాలకు తిలోదకాలిచ్చారని, ప్రభుత్వ రైతుల ధాన్యం కొనే బాధ్యత నుంచి తప్పుకోవడంతో రైతులు తమ ధాన్యం దళారులకు అమ్ముకుని నష్టపోతున్నారని అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రజలలో అభిమానం ఏమాత్రం తగ్గలేదని, కూటమి ప్రభుత్వ అవినీతి, అసమర్థపాలన ప్రజలలో ఎండగట్టాలని సూచించారు. బూత్,వార్డు, గ్రామ స్థాయి కమిటీలను త్వరగా ఏర్పాటు చేసి వారిని సమన్వయం చేసుకుని ప్రజల్లోకి వెళ్లాలని వాసుబాబు సూచించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర బూత్ కమిటీ కన్వీనర్ ఎలిశెట్టి పాపారావు బాబ్జీ, రాష్ట్ర పబ్లిసిటీ వింగ్ కన్వీనర్ నడింపల్లి సోమరాజు, రాష్ట్ర మహిళా విభాగం కన్వీనర్ మంద జయలక్ష్మి, రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ కన్వీనర్ కేతిరెడ్డి విశ్వేశ్వరరావు వాసుబాబును కలిసి తమ కృతజ్ఞతలు తెలియజేశారు. వీరివెంట నిడమర్రు ఎంపీపీ ధనుకొండ ఆదిలక్ష్మి, జిల్లా వ్యవసాయ సలహా సంఘం మాజీ చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కరణం బుజ్జి, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ తెనాలి సునీల్, గణపవరం, నిడమర్రు మండలాల పార్టీ కన్వీనర్‌లు దండు రాము, సంకు సత్యకుమార్, పార్టీ నాయకులు మనసాలకోటేశ్వరరావు, ధనకొండ శ్రీను, నిమ్మల బుజ్జి, కాన్వెంట్ శ్రీను తదితరులు ఉన్నారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరాలు



దెందులూరులో చెస్ ఆడుతున్న విద్యార్థులు



భీమడోలులో మహాకవి శ్రీశ్రీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమడోలు: అక్షరాలను ఆయుధాలుగా మలచి ప్రజల్లో చైతన్యాన్ని నింపిన మహోన్నత వ్యక్తి శ్రీరంగశ్రీనివాసరావు(శ్రీశ్రీ) భవిష్యత్తు తరాలకు ఆదర్శప్రాయుడని పలువురు వక్తలు కొనియాడారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు మూడో రోజైన బుధవారం ఉత్సాహంగా సాగాయి. భీమడోలు శాఖా గ్రంథాలయం పరిధిలోని భీమడోలు నెం.1 పాఠశాల వద్ద గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వరరావు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్‌లు చిన్నారులకు , నైతిక విలువలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు పుస్తక పఠనం చేసి, నీతి కథలు, జీకే అంశాలను వివరించారు. అనంతరం మహాకవి శ్రీశ్రీ, ఫాదర్ ఆఫ్ ఇండియా సినిమా దాదా సాహెబ్ ఫాల్కే జయంతి కార్యక్రమాలను నిర్వహించారు. పూళ్ల గ్రంథపాలకుడు డీఎస్‌బీ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో హాజరైన విద్యార్థులకు చదరంగం పోటీలు నిర్వహించారు. గుండుగొలను లైబ్రేరియన్ జి.నాగమణి ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కార్యక్రమాల్లో అభివృద్ధి కమిటి సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు, చిన్నారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరాలు

దెందులూరు: వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా బుధవారం పోతునూరు గ్రంథాలయంలో పాఠశాల విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించారు. చెస్, కోకో విభాగాల్లో పోటీలు నిర్వహించడం జరిగిందని గ్రంథాలయాధికారి రాంబాబు అన్నారు. అనంతరం విద్యార్థులకు కథలు చెప్పించి పాటలు పాడించారు. పాఠశాలలకు వేసవి సెలవులు ఇచ్చిన నేపథ్యంలో గ్రంథాలయ శాఖ ప్రభుత్వం ఇస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రతి రోజూ ఉదయం ఎనిమిది గంటల నుంచి పదకొండు గంటల వరకు శిబిరం నిర్వహిస్తున్నామన్నారు.

పెదపాడులో..

పెదపాడు: స్థానిక శాఖా గ్రంథాలయంలో మూడో రోజు శిక్షణ తరగతుల్లో భాగంగా విద్యార్థులకు వేమన పద్యాలు పఠనం చేయించారు. అనంతరం వాటి బావన వివరించారు. అనంతరం విద్యార్థులకు క్యారమ్స్‌లో పోటీలు నిర్వహించారు. అనంతరం సరిశెపల్లి లక్ష్మీనారాయణ రచించిన మాటలు నేర్పిన చిలుక కథను బాల బాలికలకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకుడు దుగ్గిపోగు జాన్‌బాబు విద్యార్థులకు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఇంటి పట్టా మంజూరుకు జీఓ విడుదల



దెందులూరు తహసీల్దార్ బీ. సుమతి

దెందులూరు: ప్రభుత్వ స్థలాలలో 2019 అక్టోబర్ 15లోపు ఇల్లు నిర్మించుకున్న వారికి ఇంటి పట్టాలు అందజేసే విధంగా జీవో నెంబర్ 30 విడుదల చేయడం జరిగిందని దెందులూరు తహసీల్దార్ బీ. సుమతి అన్నారు. బుధవారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అభివృద్ధి చేసేందుకు చెరువులు ఇరిగేషన్ స్థానాలు గ్రేజీ ల్యాండ్స్, బఫర్ జోన్, నేషనల్ హైవే, స్టేట్ హైవే, రోడ్ల సంబంధించిన స్థలాల్లో ఇల్లు నిర్మించుకుని ఉండకూడదన్నారు. ఏడబ్ల్యూడీ, గయ్యాళ్లు స్థలాల్లో ఇల్లు నిర్మించుకున్న వారు మాత్రమే అర్హులన్నారు. గతంలో ఇటువంటి ఇల్లు పట్టా లేకుండా ఎటువంటి ఆధారం లేని వారు అర్హులన్నారు. వీరికి మాత్రమే ఇళ్ళ పట్టా ఇచ్చేందుకు వార్డు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇటుకులతో గోడలు స్లాబ్ గాని రేకులతో గాని ఇల్లు నిర్మించి ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకునే సభ్యులు ప్రభుత్వ ఉద్యోగాల్లో చేయకూడదని 300 యూనిట్లు కరెంటు దాటకుండా ఉండాలన్నారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీ డిసెంబర్ 31 వరకు ఉందని తహసీల్దార్ తెలిపారు.

తపన సంస్థ సేవలు అభినందనీయం

దెందులూరు: విద్య ఆధ్యాత్మిక అభివృద్ధికి తపన సంస్థ వ్యవస్థాపక చైర్మన్ గారపాటి సీతారామాంజనేయ చౌదరి చేస్తున్న సేవలు సహాయ సహకారాలు ఆదర్శనీయమని గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. నతానియేలు, గ్రామ మాజీ సర్పంచ్ కొండేటి హనుమంతు అన్నారు. గోపన్న పాలెం ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాలలో బుధవారం తపన సంస్థ ఇచ్చిన రూ. 5 లక్షలతో ఓపెన్ జిమ్ నిర్మాణానికి ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ నతానియేలు శంకుస్థాపన చేశారు. దశాబ్దాల కాలంగా వ్యాయామ కళాశాలలో ఓపెన్ జిమ్ లేని కొరత తపన సంస్థ ఫౌండర్ చైర్మన్ గారపాటి సీతారామాంజనేయ చౌదరి సహాయ సహకారాలతో వేలాదిమంది విద్యార్థులకు భవిష్యత్తులో సేవలు అందజేయడం జరుగుతుందన్నారు. దాత గారపాటి సీతారామాంజనేయ చౌదరికి ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ నతానియల్ గ్రామ మాజీ సర్పంచ్ కొండేటి హనుమంతు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ సొంగ దిలీప్ కుమార్, డాక్టర్ రత్నబాబు, కళాశాల కమిటీ సభ్యులు వ్యాయామ అధ్యాపక విద్యార్థులు కళాశాల సిబ్బంది ఉన్నారు.



ఓపెన్ జిమ్ నిర్మాణ శంకుస్థాపనకు ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

సత్యనారాయణపురంలో శాంతి హోమం

దెందులూరు: మండలంలోని సత్యనారాయణపురం గ్రామంలో సీతారామచంద్రస్వామి దేవాలయంలో బుధవారం శాంతి హోమం, కుంభ ఆరాధన, పవళింపు సేవ హారతి తీర్థ ప్రసాద వినియోగం ఘనంగా నిర్వహించారు. సీతారామచంద్రస్వామి దేవాలయ ప్రతిష్ఠ మహోత్సవాలు సందర్భంగా గురువారం ఉదయం 9 గంటలకు మహా కుంభాభిషేకం జరుగుతుందని సత్యనారాయణపురం ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. దెందులూరుతో పాటు సమీప మండలాల్లోని భక్తులు మహా కుంభాభిషేకంలో పాల్గొని స్వామివారి అనుగ్రహాన్ని పొంది తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

మే డేను విజయవంతం చేయండి

పెదపాడు : మేడే కార్యక్రమాన్ని పంచాయతీ కార్మికులు విజయవంతంగా నిర్వహించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆర్ శ్రీనివాసడాంగే, జిల్లా నాయకులు పీ కిశోర్ తెలిపారు. పెదపాడు మండలంలోని ఏపూరు, అప్పనవీడు గ్రామాల్లో సీపీఐ ఆధ్వర్యంలో కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాస డాంగే, పి కిశోర్‌లు మాట్లాడుతూ సమాజంలో శ్రామికులకు 8గంటల పనిహక్కుకోసం 1886లో అమెరికా దేశంలోని చికాగో నగరంలో కార్మికుల వీరోచితమైన పోరాటమే మేడే అని చెప్పారు. ఆయా దేశాల్లో కార్మికుల పోరాటాలు ఉవ్వెత్తున ఎగిసిపడ్డాయన్నారు. దానిలో భాగంగానే మన దేశంలో కూడా 8గంటల పనివిధానం, కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ బోనస్, గ్యాడ్యుటీ తదితర వాటిని కార్మికులు సాధించుకోవడం జరిగిందని గుర్తుచేసారు. గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ప్రభుత్వం కార్మికుల జీతాల బాధ్యత గ్రామ పంచాయతీలకు వదిలేయకుండా 010 పద్దు ద్వారా ప్రభుత్వమే జీతాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మేడే సందర్భంగా పంచాయతీ కార్మికులు మేడే జెండాను ఆవిష్కరణలు నిర్వహించుకుని మేడే ఉత్సవాల్లో పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యికులు పాల్గొన్నారు.



పంచాయతీ కార్మికుల సమావేశంలో సంఘీభావం తెలుపుతున్న దృశ్యం

విద్యుత్ షాక్‌తో యువకుడికి గాయాలు

ఏలూరు రూరల్ : స్థానికి ఇండోర్ స్టేడియం వద్ద బుధవారం విద్యుత్ షాక్‌తో యువకుడు గాయాలపాలయ్యాడు. దెందులూరుకు చెందిన ప్రదీప్ ఏలూరులోని ప్రైవేటు కళాశాలలో చదువుకుంటున్నాడు. ఉదయం 10 గంటల సమయంలో స్నేహితులతో కలిసి ఏలూరు ఇండోర్ స్టేడియానికి వచ్చాడు. స్టేడియం గేట్లు మూసి ఉండడంతో గోడ దూకి లోపలికి ప్రవేశించే సమయంలో చెప్పులు పడిపోవడంతో స్నేహితులు వాటిని లోపలకు విసిరారు. వాటిని పట్టుకునేందుకు ప్రయత్నిస్తూ పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తీగలపై పడ్డాడు. దీంతో కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి.

ఉపాధి శ్రామికులు హక్కులను పొందాలి



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న రిసోర్స్ పర్సన్

దెందులూరు: గ్రామాల్లో ఉపాధి శ్రామికులు తమ హక్కులను పొందాలని జాతీయ ఉపాధి హామీ పథకం ఏలూరు జిల్లా రిసోర్స్ పర్సన్ అన్నారు. మండలంలోని చల్ల చింతలపూడి గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించారు. వేతనం విధులు హక్కులు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సౌకర్యాలపై సుదీర్ఘంగా శ్రామికులకు అవగాహన కల్పించారు. ఆయన వెంట దెందులూరు మండలం ఏపీవో ఫాతిమా, టెక్నికల్ అసిస్టెంట్ దీప్తి, గ్రామ నాయకులు ఉన్నారు.

పదో తరగతిలో విద్యార్థి ప్రతిభ



కలిపిండి నీహారిక

పెదపాడు: ఇటీవల విడుదల చేసిన పదో తరగతి ఫలితాల్లో వీరమ్మకుంట గ్రామానికి చెందిన కలిపిండి నీహారిక జిల్లాలోనే మూడో స్థానం సాధించడంతో మండల విద్యాశాఖాధికారులు సబ్బితి నర్సింహమూర్తి, డీవీ రమణలు హర్షం వ్యక్తం చేశారు. వీరమ్మకుంట జెడ్పీహైస్కూల్ విద్యార్థిని కలిపిండి నీహారిక 600 మార్కులకు గాను 584 మార్కులు సాధించింది. దీంతో మండలంలోని పలువురు విద్యావేత్తలు, ప్రముఖులు ఆమెను అభినందించారు. జిల్లాలో పెదపాడు మండలాన్ని మూడో స్థానంలో నిలబెట్టిన పాఠశాల ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా అభినందించారు.